14079601

ఇంటిలోన జ్యోతి వెలుగుచు నుండగ
పొరుగు ఇంటికి అగ్ని కరుగనేల
లోనె దైవంబు యుండ దైవమును మరచిన
తనను తాను మరచినట్లు కాదె.

విద్యార్థులారా!

భారతీయ సంస్కృతియందు సమస్త పదార్థములు దైవస్వరూపమే. దైవము కాని పదార్థము, దైవము లేని జీవితము ఈ జగత్తులో కానరాదు. రాయి మొదలుకొని రత్నము వరకు చీమ మొదలుకొని సింహము వరకు, పక్షి మొదలుకొని గరుడ వరకు, చిన్న గులకరాయి మొదలుకొని పర్వతము వరకు దైవమే. భారతీయులు చెట్టును, గుట్టను మట్టిని పూజిస్తూ వచ్చారు. ఈనాటి భారతీయులు ఈ పవిత్ర సాంప్రదాయమును విస్మరించి కేవలము లౌకిక జగత్తులో ఇవన్నీ మూఢ విశ్వాసములుగా భావించి ఆధునిక యుగమందు విద్యార్థులు ఈ విధమైన మార్గమునే అనుసరిస్తూ ప్రాచీన సాంప్రదాయము మూఢ విశ్వాసమని వెనుకకు నెట్టివేస్తూ వచ్చారు. భారతీయుల విశ్వాసము గొప్ప అంతరార్థముతో కూడినది. భగవంతుడు అనుగ్రహించిన ఈ ప్రేమ తత్వమును మానవుల వరకే పరిమితము కాకుండా సర్పాలయందు, సర్వ పదార్థములందు ఈ ప్రేమ తత్వము ప్రసరింప చేస్తూ వచ్చారు భారతీయులు. త్యాగరాజు

చీమలో బ్రహ్మలో శివకేశవాదులలో ప్రేమ మీర వెలసియుండె
బిరుదు వహించిన సీతారామ నన్ను బ్రోవరా.
రామ నన్ను బ్రోవరా!

భగవంతుని దివ్యత్వము సర్వత్ర వ్యాపించినది. భారతీయులు దారిపైనుండిన చిన్న రాయిని కూడా పూజిస్తూ వచ్చారు. విష సర్పములు ప్రవేశించిన పుట్టలు కూడా ప్రేమిస్తూ పూజిస్తూ వచ్చారు. ఈ విధముగా భారతీయులు పూజించని పదార్థము జగత్తులో కానరాదు. ఇప్పటికి కలకత్తా పరిసర ప్రాంతములలో చీమలను, పక్షులను ఆహారము నందించుట మహా సేవ చేస్తున్నారు. భూత దయ, విశ్వాత్మ మనను భారతీయులకు పెట్టిన పేరు.

ఇలాంటి భారతీయ సంస్కృతిని మూఢ విశ్వాసమని భావించుటము అంతకంటె మూర్ఖత్వము మరొకటి లేదు. పాశ్చాత్యులు సోదర భావము కంటె గొప్పది లేదన్నారు. కాని భారతీయ సంస్కృతి యందు భ్రాతృత్వము కంటె అధికమైన స్థానము మరొకటున్నది. అదే ఏకాత్మ

భావము. సర్వుల యందున్న ఆత్మ తత్వము ఒక్కటే అనే తత్వము ప్రచార ప్రబోధలు సల్పినది భారతీయ సంస్కృతిని మూఢత్వమని చెప్పుటలో యింతకంటె మూఢత్వము మరొకటి లేదు. సాంఘిక ధర్మము ఏదేశమందు కానరాదు. ఏదేశమునందు చూచినా భిన్న భిన్న తెగలని భావిస్తూ వచ్చారు. కాని భారతీయులు ఒక్కరు మాత్రమే అనేకత్వములో నున్న ఏకత్వమును లోకమునకు ప్రబోధిస్తూ వచ్చారు. ఇదియే చిరకాలమునుండి మన భారతదేశమందు అభివృద్ధి గావించి యితరదేశములకు ఈ ఆధ్యాత్మిక సంపత్తిని అందించి అనేక శాంతి భద్రతలు చేకూరుస్తూ వచ్చారు. సాంఘిక జగత్తునందు, ఈ పవిత్రమైన దేశమందు, దివ్యమైన భావమునందు నవ్యమైన యుగమునందు ఈ పవిత్ర చరిత్ర మరువరానిది. ఇది గొప్ప విశాలహృదయులకు అర్థమవుతుంది గాని సంకుచిత బుద్ధిగలవారికి కేవలము మూర్ఖముగనే కనిపిస్తుంది. దేవుడు లేని స్థానమెక్కడ? దేవుడు లేని పదార్థమేది? అంతా భగవంతునిదే. అణోరణీయాన్ మహతో మహీయాన్. ఈ అణువులు చేరటంచేత ఘనముగా ఏర్పడుతుంది. ప్రతి అణువునందున్న దైవత్వమును కాదని చెప్పటానికి ఏ సైంటిస్టు ముందుకు వస్తాడు. అణువు దైవము కాదని చెప్పేవాడు సైంటిస్టే కాదు. సర్వము పరమాణువుల స్వరూపమే ప్రకాశిస్తున్నది. అందువలనే ఎక్కడ చూచినా భగవంతుడేనని రామదాసు పాడుతూ వచ్చాడు. రామ తత్వము తప్ప మరొక తత్వము ప్రపంచములో కానరాదు. అంతా రామమయం ఈ జగమంతా రామమయం. ప్రతి పదార్థము మనలను రక్షింప చేసేదే. కాని ఈనాటి విద్యావిధానము అనేక విపరీత మార్గములలో ప్రయత్నం చేయుట చేత దివ్యత్వము విస్మరిస్తూ పోతున్నారు.

ఈనాటి చదువులన్నీ పొట్టకూటి చదువులు మాత్రమేగాని బుద్ధి అభివృద్ధి పరచేది, జ్ఞానమును వికసింపచేసేది కాదు.

పాపభయంబు పోయె పరిపాటయి పోయెను దుష్కృతంబులన్
శ్రీపతి భక్తి పోయె వివరింపగ లేని దురంత కృత్యముల్
దాపుర మయ్యె లోకమున తాపస లోక శరణ్యుడైన ఆ
శ్రీపతి నామ చింతనయె చేకూర జేయు సుఖంబు మానవా!

పుస్తకముల్ పఠించితిని పూర్తిగ జూచితి సర్వశాస్త్రముల్
నిస్తులమైన విద్యలు నేర్చితి నంచును గర్వమేల నీ
హస్త యుగంబు మోడ్చి పరమాత్మను భక్తితో కొల్వలేని యా
ప్రస్తుత విద్యలన్నియును ధాత్రి నిరర్థకము కద మానవా!

ఈనాటి విద్యలన్నీ కేవలము పొట్టకూటిని అందించలేకపోతున్నాయి.

నిద్దురనుండి లేచి మరి నిద్దుర పోయెడు దాక పొట్టకై
హద్దును పద్దు లేక వ్యయమందగ జేయుచు జీవితంబు నే
విద్దెల ధారపోసి అరవింద దళాక్షుని విస్మరించి ఏ
పెద్ద సుఖంబు నొందితివొ ప్రతిగ యోచన చేయు మానవా।

జంతూనాం నరజన్మ దుర్లభమ్. నరజన్మ ఎత్తి కూడను ఇదా మనం సంపాదించవలసినది. ఇదా మనము సాధించవలసినది. ఇదా మనం పొందవలసినది. కాదు కాదు. మన ఆనందము వేరు. మన గమ్యము వేరు. మన లక్ష్యము వేరు. కానీ ఆ సత్యనిత్యమైన దానిని విస్మరించి అసత్యము అనిత్యము అశాశ్వతమైన దానిపై మన లక్ష్యమును అభివృద్ధి పరచుకుంటున్నాము. ప్రాకృత విద్య ఉండవలసినదే. కాదని నేను చెప్పటం లేదు. ఇదంతా కేవలం ప్రాకృతమైనది. ఇది ప్రవృత్తి తత్వము. కాని మనది నివృత్తి లక్షణము. ప్రవృత్తిది అనిత్యము అశాశ్వతము. నివృత్తిదే సత్యము నిత్యము. కనుక ఈ నివృత్తి మార్గమును పొందుటకు ప్రయత్నించాలి. కానీ పుస్తకములలో ఉంటున్నది knowledge. ఆ knowledge ఎంతవరకు పని చేస్తుంది. ఆ పుస్తకమును మస్తకముగా మార్చుకుంటే మస్తకము కూడా మట్టి అయిపోతుంది. పుస్తకము మట్టి అయిపోతున్నది. కారణం ఏమిటి? సంగదోషము: పుస్తకములోనున్న knowledge మస్తకములో చేరేటప్పటికి మస్తకము కూడా పుస్తకముగా మారి పోతున్నది. పుస్తకము యొక్క knowledge కాదు మనకు కావలసినది. మస్తకము యొక్క knowledge అదే practical knowledge. Practical knowledge మనం సాధించాలంటే ఆధ్యాత్మిక మార్గము తప్ప అన్య మార్గములో వీలుకాదు.

యద్భావం తద్భవతి. నీ భావమున విశ్వాసము పవిత్రముగా ఉండినప్పుడు ఆ ఫలితము కూడా పవిత్రముగా లభ్యమవుతుంది. పూర్వకాలమందు శ్రీమంతుల యింటి ముందు ఒక చిన్న గూడు ఉండేది. ఆ గ్రామస్థులందరు ఆ శ్రీమంతుని యింటి ముందున్న జ్యోతినుండి వారి యింటి జ్యోతిని వెలిగించుకొని పోయేవారు. ఎందుకనగా ఆ శ్రీమంతుని యింటినుండి వచ్చిన జ్యోతి వారిని కూడా శ్రీమంతునిగా మారుస్తుందని విశ్వాసము. ఈ సాంప్రదాయము పురస్కరించుకొని వ్రేపల్లెయందు యశోద ఇంటి ముందు గూడులో దీపము వెలిగించేది యశోద. గోపుల యిండ్ల వారు వచ్చి ఆ జ్యోతిని వెలిగించుకొని పోయేవారు. అప్పటికే కృష్ణుడు మధుర చేరిపోయాడు. ఆ వ్రేపల్లెలో కృష్ణుని లీలలు చరిత్రలు వింటుంటే కొత్తగా వచ్చిన కోడలుకు చాలా పిచ్చి పట్టినట్లయింది. నేను వచ్చేటప్పటికి కృష్ణుడు వ్రేపల్లె వదలి మధుర చేరిపోయినాడు కదా. చింతిస్తూ ఉండేది. ఇంతకు పూర్వము అత్తగారు వచ్చి జ్యోతిని వెలిగించుకొని పోయేది. కానీ సుసూరా అదృష్టమేమిటోగాని అత్తగారికి

జ్వరం వచ్చింది. అప్పుడు జ్యోతి వెలిగించటానికి సుగుణే వెళ్లవలసి వచ్చింది. ఆ పరమాత్ముడు తిరిగిన ప్రదేశము చూడటానికి అవకాశము ప్రాప్తించి కదాయని ఎంతో ఆనందముతో యశోద యింటిలో ప్రవేశించింది. దైవత్వము విశ్వాసముపై ఆధారపడి ఉంటుందిగాని సాధనలపై కాదు, పారాయణాలపై కాదు పాండిత్యముపై కాదు. గొప్పగొప్ప పండితులుంటున్నారు. గొప్పగొప్ప యోగులుంటున్నారు. మహా త్యాగులుంటున్నారు. ఎవరికి ప్రాప్తించని ప్రాప్తి ఆ సుగుణకు కలిగింది. వ్రేపల్లెలో కాలుపెట్టినది మొదలుకొని అయ్యో నాప్రాప్తి యిట్లా అయిపోయిందే కృష్ణుడు వ్రేపల్లె వదలి వెళ్ళిపోయాడని నిరంతరము కృష్ణచింతనయే. ఆదీపము ముందు తన దీపము పెట్టింది పాపం. ఆదీపము వెలుగుతున్నది. సుగుణ దేహము మరచిపోయింది. ఆమె చేయి కాలిపోయింది. బట్టవాసన వేస్తున్నదని యశోద పరుగెత్తి వస్తున్నది. ఏవరమ్మా నీవు దేహము కాలిపోతుంటే ఏమాత్రము లక్ష్యము చేయటం లేదా. ఇంకా అనేకమంది గోపికలు దీపము వెలిగించుకోటానికి వచ్చారు. వారందరు కాచుకొన్నారు. జ్యోతిలో కృష్ణుడు కనిపిస్తున్నాడు సుగుణకు. ఆ జ్యోతిలో కృష్ణుని చూస్తూ సుగుణ దేహము మరచిపోయింది. అందరు కూడి ఏమికనిపించిందని అడుగుతే ఆమె చెప్పేటప్పటికి గోపికలు దాన్ని పాడారు

సుగుణకు కనిపించెనంట మన సుగుణకు కనిపించెనంట
నందుని ఇంట గోపాలుడంట దీపాన కనిపించెనంట
అదియే వేలికి తగిలినమంట

ఇంత ఆనందములో ఉంటున్నారు. ఏ పూజలు చేసింది. వారికి పూజలు జపములు అంటే యేమీ తెలియదు. ఆనాడు యీనాటి చదువులు లేవు. అదే వారి అదృష్టము. ఈ చదువులు ఆనాడు ఉండి ఉంటే ఈ ప్రాప్తి లభించేది కాదు. వారి లక్ష్యమంతా దైవముపైనే. ఈ నాటి ఆధునికుల లక్ష్యమంతా పుస్తకముపైనే ఉంటున్నది. చదివిన తరువాత పరీక్షలపైన లక్ష్యము. పరీక్షలపై లక్ష్యముతో కాఫీలు తాగి చదవటం. తన వివేకము చెడగొట్టుకోటం. జ్ఞాపకశక్తి మందపడి పోవటము. ఈ విధముగా మానవుని శక్తులను నిర్మూలము గావించుకుంటున్నారు. ఆనాటి సుగుణకు నిరంతరము కృష్ణచింతనయే. ఆ విశ్వాసమే ఆమె కింత ప్రాప్తికి కారణము. ప్రాప్తి విశ్వాసముపై ఆధారపడి ఉంటుందిగానీ మరొకదానిపై కాదు. మిద్దె ఎక్కాలంటే భూమిపై నిచ్చెన మోపాలి. పైన ఆనించాలి. క్రిందదే విశ్వాసము, పైన ప్రేమ. ఆధారము లేకపైకి ఎక్కటానికి వీలులేదు. ప్రేమ విశ్వాసములే మూలకారణములు. ఇదే పెద్ద సాధన.

పూర్వశరీరమందు బాంద్రాగ్రామములో హేమాద్రిపంతు పరమభక్తుడు సాయిబాబాకు ఉండేవాడు. అతనిని అన్నాసాహెబు అంటారు. ఈ అన్నాసాహెబు ఎప్పుడు బాబా, బాబా

14079605

యని బాబాను చింతిస్తూ ఉండేవాడు. పండుకున్నాడు. మూడు గంటలకు లేచాడు. చూచాడు. పెద్ద ఆజానుబాహుడు వచ్చినట్లు కనిపించింది. తలుపులు వెరచి ఉన్నాయి. వచ్చాడు. అన్నాసాహెబు వీపుపై తట్టాడు. 'అన్నాసాహెబ్ రేపు మీ యింటికి భోజనమునకు వస్తున్నాను' అన్నాడు. స్వప్నమా లేక యదార్థమా యని యోచించాడు. స్వప్నము కాదు. బాబా యే నా దగ్గరకు వచ్చాడు. రేపటి దినము నా యింటికి భోజనమునకు వస్తాడు రేపటి దినము నా యింటికి భోజనమునకు వస్తాడని ఒకటే ఆనందము. ఈ అరుపులు ఈ కేకలు వినింది భార్య. 'ఏమండీ మీకు స్వప్నమా లేక గిలియా ఎందుకీ అవస్థ పడుతున్నారు' అంది. ఇది కేవలం స్వప్నము లా ఉంది. మూడుగంటలప్పుడు బాబా యిక్కడకు రావటం ఏమిటి? ఎక్కడిది షిర్డీ ఎక్కడ బాంద్రా ఇదంతా మీ భ్రమ' అంది ఆమె. చెప్పాడు 'పిచ్చిదానా భగవంతునికి దూరము దగ్గర అనేది లేదు. సర్వత్రా ఉన్న భగవంతునికి రావటం పోవటం ఎక్కడ. భగవంతునిది రాకపోకలు లేని స్వరూపము. ఎక్కడ ఎవరికి ప్రాప్తో అక్కడ వారికి కనిపిస్తాడు. ఎవరికి ప్రాప్తి లేదో వారికి కనిపించడు. వారి వారి విశ్వాసానుసారంగా నడుస్తుంది. బాబా రేపటి దినము మన ఇంటికి వస్తాడు. తప్పక తెల్లవారి లేస్తూనే వంటలు చేయాలి అన్నాడు. బాబా నిజంగా మన ఇంటికి వస్తే అంతకంటె అదృష్టమా అంది భార్య. తెల్లవారి లేచింది. ఇల్లంతా కడిగింది పాత్రలంతా శుభ్రము చేసింది. ప్రత్యేకంగా వంటలంతా వండింది. పాయసము వండింది. స్వీట్లు మరొకటి చేసింది. వడలు చేసింది. భోజన సమయమునకు బాబా వస్తాడని కాచుకుని ఉంటున్నారు. చక్కని పూలతోరణములతో మామిడి ఆకులు అలంకరించారు ఇల్లంతా. 12 గంటలైంది. బాబా రాలేదు. వచ్చే సూచనలు కనిపించలేదు. అన్నివైపుల చూస్తున్నారు. బాబా ఎందుకు రాలేదో. బాబా ఆడిన మాట తప్పడు. అతను సత్యస్వరూపుడు. అతనే సత్యనారాయణుడు. అతని కంటె సత్యము వేరు లేదు. వచ్చే తీరుతాడు. బాబా యిచ్చిన మాట తప్పడు. అని భార్యకు నచ్చచెబుతున్నాడు. సరే రెండుగంటలైంది. వచ్చే జాడలు కనిపించలేదు. సరే ఇంకేమి చేసేది అనుకున్నారు. ముందు రూమునుండి ఇద్దరు సాహెబులు వచ్చారు. ఏమండీ అన్నాసాహెబు గారు మీరు తొందరలో ఉన్నట్లున్నారు. బంధువులు వచ్చారు. భోజనాలకి రెడీ చేసుకుంటున్నారు. ఇప్పుడు మాట్లాడుటకు వీలుకాదు. మీ పని మీరు చూసుకోండి. ఇదుగో ఈ ప్యాకెట్టు తీసుకోండి. అన్నారు. ప్యాకెట్టు తీసుకున్నారు. వారు వెళ్ళిపోయారు. తీస్తే బాబా పటము. బాబా నీవు ఈ రూపముగా వచ్చావా నా ఇంటికి. అని ఫోటోనే గట్టిగా కరచుకున్నాడు. భక్తి అంత పిచ్చిగా ఉంటుంది. 'పిచ్చులు పట్టించు పిచ్చులు పోగొట్టు సచ్చిదానంద సాయిబాబా' బాబా ఎందుకో విధంగా పిచ్చి పట్టిస్తున్నాడు. ప్రపంచపు పిచ్చి పోగొడతాడు. తన పిచ్చిని పట్టిస్తాడు. ఆపాటో

తీసుకుని ఆకు ముందు పెట్టాడు. బాబా నీవు భుజించే వేళాయె. ఈ రూపములో వచ్చావు అని చెప్పాడు. ఆ ఫోటో నిల్చటానికి వీలు లేదు. ఒక టంబ్లరు పెట్టి ఆ టంబ్లరుకు నిలబెట్టాడు. పాట:

కన్నీరు తెప్పించు కన్నీరు తప్పించు
చిన్మయ మూర్తి ఈ చిన్నబాబు.

లోకసంబంధమైన కంటి నీరు తుడిచివేస్తాడు. తన నిమిత్తమై కంట నీరు తెప్పిస్తాడు. బాబా నీవు భుజించాలి అన్నాడు. కన్నులు మూసుకొని ప్రార్థిస్తున్నాడు. తట్టలో నున్న ఒక వడ లేదు. అన్నమంతా కుప్ప మాదిరి వర్ధించింది. చెదరిపోయి ఐదు వేళ్లు కనిపిస్తున్నాయి. బాబా తిన్నాడని ఆ అన్నమంతా తానే తినేస్తున్నాడు బాబా ప్రసాదమని. అనగా ఆనాటి పరిస్థితులకు ఆనాటి చర్యలు. భక్తులకు తృప్తిగా ఉండేది. వస్తాను అని చెప్పిన తరువాత ఏదో ఒక రూపములో వచ్చేవాడు. భగవంతుడు సర్వస్వరూపుడు అంటే మూలకారణం ఏమిటి? కుక్కగా వచ్చి భోజనం చేసేవాడు. పక్కింటి ఎనుముగా వచ్చి ఆకులో నుండేది తినేది. పిల్లిగా వచ్చి తినేది. అప్పుడు ఆ రూపమును ధరిస్తు ఉండేది.

ఇప్పుడు అట్లా కాదు. వస్తాను మీ ఇంటికి అంటే ప్రత్యక్షముగా వస్తాను. భోజనము చేసి పోతాను. అనేక మందికి చెబుతున్నాను. బొంబాయికి వచ్చినప్పుడు మీ యింటికి వస్తాను అని. తప్పక చెప్పినట్టు వెడుతున్నాను. భోజనము చేస్తున్నాను. ఎందుకోసం. ఆనాటి భావము యొక్క ప్రభావము ఈనాటి భావము యొక్క ప్రభావము వేరు. ఆనాడు పూర్తి విశ్వాసముతోనే ఉండేది. ఆనాడు పూర్తి ప్రేమలోనే మునిగేది. ఈనాటి విశ్వాసము కొంతవరకే. చెప్పినప్పుడు కొంతసేపు ఆనందము ఉంటుంది. తరువాత వస్తారో లేదో నా తృప్తికోసం చెప్పారో యేమో అనే సందేహాలు వస్తుంటాయి. సందేహములకు అవకాశము యివ్వకూడదు. పూర్ణవిశ్వాసములో ఉండినప్పుడు తప్పక ఆ మాట జరిగిపోతుంది. అదే దైవ వాక్కు. అదే అమృత వాణి. అదే దివ్యవాణి. ఎప్పటికి తప్పేది కాదు. కాని మీ మీ విశ్వాసములలో ఉండే లోపము వలన అది తప్పిపోతుంటుంది. మీరు విశ్వాసము ధృఢముగా పెట్టుకోండి. ఎన్ని పరిస్థితులు అడ్డు తగిలినా విశ్వాసము మార్చుకోకండి. ఏ విధమునైన కష్టము లొచ్చి పడినా సరే భగవంతుని విశ్వాసము వదలకుండా ఉండాలి.

పూర్వపు చరిత్రలో షిరిడీ యందు మాటలు చెప్పటముగాని రూపము కాకుండా ఇంకొక రూపములో రావటము కొంత మంది అంతరార్థము గుర్తించుకోలేనివారు బాబా మీరు వస్తారని కాచుకొని కూర్చున్నామే మమ్మల్ని ఎందుకింత నిరాశ చేశారు. ఎందుకింత కష్టపెట్టారు ఏమి పాపము చేశామని అని వారు బాధపడేవారు. లేటా నేను వచ్చాను మీ యింటికి. కళ్లు

14079607

తీసుకొని తరుము కొట్టారు. ఏమిటి కట్టె తీసుకొని మిమ్మల్ని తరుము కొడుతామా అని వారు ఎంతో బాధ పడే వారు. వచ్చాను. నల్ల కుక్క రూపములో వచ్చాను. అనగా ఏమిటి? అన్ని జీవులందు భగవంతు డున్నాడు అని నిరూపించేదే భారతీయ సంస్కృతి. చూడండి ఎలుక. ఎలుక ప్రత్యేకంగా కనబడితే ఏర్పాట్లు, కట్టె తీసుకు కొడతాము. ఇదే వినాయకుని క్రింద ఉంటే దానికి నమస్కారము చేస్తాము పూజిస్తాము. దైవసన్నిధిలో ఉండే ప్రతి దానికి నమస్కార అర్హత ఉంటుంది. పామును బయట ఎక్కడైనా చూస్తే పట్టిస్తాము. అదే సర్పము ఈశ్వరుని ఆభరణముగా ఉండినప్పుడు నమస్కరిస్తాము. సన్నిధి బట్టి పెన్నిధి పెరుగుతుంది. సమీపత్వాన్ని పురస్కరించుకొనే గౌరవ మర్యాదలు లభిస్తుంటాయి. సన్నిధి దూరమైతే ముఖము చూచే వారుండరు. సర్వత్రా మనము భగవంతుని సన్నిధి లోపలనే ఉంటున్నాము. ఎక్కడ చూచినా భగవత్ తత్వమే. రాకపోకలు లేని తత్వము భగవత్ తత్వము.

ఒకానొక సమయంలో పార్వతీ పరమేశ్వరులు ఇద్దరు కుమారులకు ఆటల పోటీ పెట్టారు. వినాయకా, సుబ్రహ్మణ్యా ఇటు రండి. ఈనాడు ఒక పని పెట్టాలి మేము. మీరు చేయండి అన్నారు. చెప్పండి అన్నారు ఇద్దరు. అమ్మా మీ ఆజ్ఞ శిరసా వహిస్తాము అన్నారు. మీ ఇద్దరు పోయి ఈ విశ్వమునంతా చుట్టి రావాలి. ఎవరు ముందు వస్తారో రండి అన్నారు. వినాయకుని పొట్ట చాలా పెద్దది. వాహనము ఎలుక చాలా చిన్నది. ఎట్లా ప్రయాణము చేయగలడు. పరీక్షించుటకు చూసారు. సుబ్రహ్మణ్యం వాహనం నెమలి. కూర్చున్నాడు బయలుదేరాడు. స్పీడుగా పోతున్నది నెమలి. కానీ ఎలుకను రమ్మని చెప్పలేదు విఘ్నేశ్వరుడు. ఏమాత్రము చింత చేయలేదు. కూర్చున్నవాడు అట్లే కూర్చున్నాడు. అంత దూరము లోపల సుబ్రహ్మణ్యం వచ్చేది చూచాడు. ఈశ్వరునికి, పార్వతికి ప్రదక్షిణ చేసి నేనే ముందు వచ్చాను అన్నాడు. పార్వతి చెప్పింది ఎంత యుక్తిపరుడురా నీవు. నీ అన్నగారు పరుగెత్తి వచ్చాడు అతను 1st గానీ నీవు మమ్మల్ని ఇద్దరిని చుడితే విశ్వాన్ని ఎలా చుట్టినట్లు అంది. పార్వతీ పరమేశ్వరులకు తెలియక కాదు. లోకమునకు భగవంతుడు సర్వవ్యాపకుడు అని తెలుపటానికి ఈవిధమైన నాటకమాడుతూ వచ్చారు. అప్పుడు వినాయకుడు చెప్పాడు అమ్మా! ఎక్కడ చూచినా మీ ఇద్దరే కదా ఉంటుండేది. శక్తి ఈశ్వరుడు రెండే. పార్వతి matter. ఈశ్వరుడు energy. జగత్తు లో ఈ రెండే ఉంటున్నాయి. మిమ్మల్ని ఇద్దరిని చుడితే విశ్వాన్ని చుట్టినట్లయింది. ఆ తెలివిని బట్టి వినాయకునికి ఒక ఫలము ఇచ్చింది. తరువాత ఇంత చుట్టు చుట్టిన సుబ్రహ్మణ్యమునకు ఫలము ఇచ్చింది. నాయనా చుట్టి రావటములో నీవు 1st. అంతరార్థము ప్రబోధించుటలో వినాయకుడు 1st. చుట్టి వచ్చావు కాబట్టి ఫలము. అదే పళని. కోయంబత్తూరు దగ్గరుంది.

14079608

లోతుగా విచారించుతే పవిత్రమైన భగవంతుని చరిత్ర చక్కగా అర్థమవుతుంది. పైపై తేలేవానికి ఏమాత్రము అర్థము కాదు. ప్రేమ అనే జలములో తలమునిగినవాడు ఏమీ మాట్లాడలేడు. నీటిపై తేలేవాడు ఎక్కువ మాట్లాడుతూ ఉంటాడు. భక్తి విశ్వాసములలో మునిగినవానికి ఏమి తెలియదు. తన్మయుడై ఉంటాడు. ఈనాటి పండితులుగాని విద్వాంసులుగాని కవులు అని చెప్పుకొనే వారూ పైపైన తేలేవారే. కాని నిండా మునిగినవానికి ఏ మాటలు రావు. ఆనందమే అతని భాష. దీనికంటె మించినది ఏమి కావాలి. భగవంతుని అన్వేషణ చాలా పొరపాటు. సర్వత్రా ఉండిన వాని అన్వేషణ ఏమిటి? అన్వేషణే లేదు. ఒకానొక సమయంలో అనిబిసెంటు కూడా చెప్పింది. భగవద్గీతలో భక్తులు భగవంతుని అన్వేషిస్తున్నారని చెప్పారు. అనేక మార్గాల్లో చేస్తున్నారు

శ్రవణం కీర్తనం విష్ణుస్మరణం పాదసేవనం
వందనం అర్చనం దాస్యం స్నేహ మాత్మ నివేదనం

ఆమె వినింది. భగవంతుని అన్వేషణ చేయుటమా. సర్వత్ర ఉన్న భగవంతుని అన్వేషణ ఎక్కడ. ప్రతి వ్యక్తి భగవత్స్వరూపుడు. భగవంతుడే భక్తుని అన్వేషణ చేస్తున్నాడు. ఎక్కడ నాకు నిజమైన భక్తుడున్నాడు.

వెతుకుతున్నాను నేను వెతుకు చూసి ఉన్నాను
వెతుకుచున్నాను నేను నిజ మానవ భక్తులను.

నిజమానవ భక్తుని వెతుకుతున్నాను. నిజమైన భక్తి పక్షులలో ఉంటున్నది. పశువులలో ఉంటున్నది. ఏమి దురదృష్టమో నిజమైన భక్తి మానవులలో లేక పోతున్నది. అంతా part time devotion గా ఉంటున్నది. ఎక్కడున్నాడు దేవుడంటె ఇకపై పూర్తి విశ్వసించాలి. మీరే భగవత్స్వరూపులు. దేహము దేవాలయము. దీనిలో జీవుడనే దేవుడున్నాడు. అతనే పరమాత్మ తత్త్వము. నీవే పరమాత్మ తత్త్వము. ఇంతకంటె మరొక దేవుడు ఎక్కడున్నాడు. ఆ విశ్వాసము దృఢముగా రావాలి. అప్పుడే నిజమైన ఆనందము, నిజమైన ప్రేమ రుచి మనకు చక్కగా తెలుస్తుంది. చేతిలో పెట్టుకొని చక్కెర రుచి ఎట్లా ఉందంటే మనకు అర్థము కాదు. నాలికపై వేసుకో నాలికపై వేసుకున్నంత మాత్రమున రాదు. చప్పరించు. తీయని రసముగా లోపలకు వెడుతుంది.